
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



ప్రమాదం వెంటే ప్రమాదం
దీపావళి అంటేనే దీపాల పండుగ. బాణసంతా వెలుగుల్లో లోగిళ్లు కాంతులీనాలి. ఇందుకోసం అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. 10లో



కిలో టమాట రూ.26
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.2°/19.4°
జిల్లాలో సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రక్తదానం ప్రాణదానంతో సమానం



బ్లడ్‌డొనేషన్ డ్రైవ్ పోస్టర్ వద్ద ఎస్పీ రత్న, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అందువల్ల ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. పోలీసులు, ఆటో డ్రైవర్లు, సంస్కృతీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, పాత్రికేయులు దాదాపు 250 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ఎస్పీ రత్న జ్యూస్, ఓఆర్ఎస్ పాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజ భద్రత, దేశ రక్షణలో ఎందరో పోలీసులు ప్రాణత్యాగాలు చేశారని, వారిని స్మరించుకుంటూ పోలీసు అమరవీరుల వారోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఈనెల 31 వరకూ వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. చివరిరోజు వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐ వలి, మహేష్, డీఎస్పీలు విజయకుమార్, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్డీటీ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కిషోర్, సీఐలు ఇందిర, సునీత, సురేష్, నరేంద్రరెడ్డిపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

- అధికారులకు మంత్రి సవిత ఆదేశం



ప్రజా దర్బార్‌లో సమస్యలు వింటున్న మంత్రి సవిత

గోరంట్ల: భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపి బాధితులకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా 'ప్రజా దర్బార్' నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్కువ శాతం అర్జీలు భూ సమస్యలపై అందగా.. మంత్రి సవిత రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా భూ సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. అలాగే తాగునీటి సమస్యలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు సరిగాలేవంటూ ప్రజల నుంచి అర్జీలు అందాయి. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపిన మంత్రి సవిత వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్ర కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నశాలానికి నిషా

- భారీగా పెరుగుతున్న మద్యం కిక్కు
- ఉదయం 9 నుంచే మద్యం తాగి వీధుల్లో పడిపోతున్న యువకులు
- నిమిషానికి నగటున 64 లీటర్ల మద్యం తాగుతున్నట్టు వెల్లడి
- ఉమ్మడి జిల్లాలో 12 రోజుల్లోనే రూ. 81 కోట్ల మద్యం విక్రయం
- ఇప్పటికే గ్రామాల్లో తమ్ముళ్ల ఆధ్వర్యంలో బెల్టుషాపులు
- ఎమ్మెల్యేలతో మద్యం షాపుల నిర్వాహకుల సంప్రదింపులు
- ప్రజాప్రతినిధులకు మట్టి, ఇసుక తర్వాత ఆదాయ వనరుగా మద్యం



రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ గ్రామంలో ఏర్పాటైన బెల్టుషాపు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం కిక్కు నశాలానికి ఎక్కించారు. పల్లె పల్లెనా ప్రజలు తాగుతూ తూలుతూ ఉండేలా చేస్తున్నారు. 99 రూపాయలకే చీప్ లిక్కర్ అంటూ టీడీపీ నేతలే బ్రాండ్ అంబాసిడర్‌లుగా మారి అమ్మకాలు భారీగా పెంచుతున్నారు. మద్యం నియంత్రించాల్సిన నేతలే ఉదయం 8 గంటల నుంచే అమ్మకాలు ప్రారంభించి ఆదాయ మార్గానికి రాచబాటలు వేసుకున్నారు. నాణ్యమైన మద్యం అందించకుండా, ధరలు తగ్గించకుండా, బెల్టుషాపులను కట్టడి చేయకుండా యువతను, సామాన్యులను మత్తులో జోగేలా చేస్తున్నారు. రెండు జిల్లాల్లోనూ మట్టి, ఇసుక తర్వాత ఎమ్మెల్యేలకు మద్యం విక్రయాలు ప్రధాన ఆదాయ వనరుగా మారాయి.

నిమిషానికి 64 లీటర్లు..!

అనంతపురంతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలో నిమిష నిమిషానికీ నిషా ఎక్కిస్తున్నారు. 2024 జూన్‌కు ముందు రోజుకు రూ.3 కోట్ల మద్యం విక్రయాలు జరిగితే మహా గొప్ప. కానీ ఇప్పుడు రూ.7 కోట్ల వరకు జరుగుతున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. రోజుకు 12 గంటల పాటు మద్యం షాపులు నడిస్తే నిమిషానికి 64 లీటర్ల మద్యం వినియోగమవుతున్నట్టు అంచనా. అంటే గంటకు 3,840 లీటర్లు పైగా మద్యం అమ్ముడవుతున్నట్టు లెక్క. కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చాక గడిచిన 12 రోజుల్లో 8.56 లక్షల లీటర్ల మద్యం ప్రభుత్వం విక్రయించగా, 65 శాతం అంటే 5.52 లీటర్ల మద్యం అమ్ముడయినట్టు తేలింది. దీనిద్వారా ప్రభుత్వానికి రోజుకు రూ.6.76 కోట్ల ఆదాయం చేరింది.

బెల్టుషాపులు మొదలు..

రెండు జిల్లాల్లోనూ బెల్టుషాపులు మొదలయ్యాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే గ్రామాల్లో మద్యం అమ్ముతున్నారు. పర్మిట్ రూముల కోసం ఎమ్మెల్యేలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే 90 శాతం మద్యం షాపులు ఎమ్మెల్యేల చేతుల్లో ఉన్నాయి. అనంతపురం అర్బన్‌లో ఎమ్మెల్యేకు చెందిన మద్యం షాపులను ఉదయం 8.30 గంటలకే తెరిచి విక్రయిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాదు సిండికేట్ పరిధిలోకి రానివారిని ఇప్పటికీ బెదిరిస్తున్నట్లు తెలిసింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ లేదా 30 శాతం కమీషన్.. రెండింటిలో ఏదైనా ఒక దానికి ఒప్పుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు.

బెల్టుషాపులు తెరిస్తే కేసులు

జిల్లాలో ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. ఈ మేరకు ఎక్సైజ్ సీఐలకూ ఆదేశాలిచ్చాం. రాయదుర్గంలో బెల్టుషాపు నిర్వహణ వార్త వచ్చిన నేపథ్యంలో సీఐకి మెమో ఇచ్చాం.ఉదయం 10 గంటలకంటే ముందు షాపు తెరిచినా, రాత్రి 10 గంటలు దాటాక షాపు తెరిచి ఉంచినా కేసులు తప్పవు.

– రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఈనెల 16వ తేదీ నుంచి 28వ తేదీ ఉదయం 11 గంటల వరకు ఉమ్మడి జిల్లాలో మద్యం విక్రయాలు

వైన్‌షాపులకు వెళ్లిన మద్యం	95,142 కేసులు
లీటర్లలో	8,56,278
వినియోగం అయిన మద్యం	5,56,580 లీటర్లు
గంటకు సరాసరి వినియోగం	3,865 లీటర్లు
నిమిషానికి తాగుతున్నది	64.41 లీటర్లు
12 రోజుల్లో బీర్ల అమ్మకాలు	25,305
బీర్ల అమ్మకాలు (లీటర్లలో)	16,448
మద్యం, బీర్లనుంచి వచ్చిన సొమ్ము	రూ.81,21,68,724
అనంతపురం జిల్లా నుంచి	రూ.50,84,42,652
'శ్రీ సత్యసాయి' జిల్లా నుంచి	రూ.30,37,26,072
రెండు జిల్లాల నుంచి రోజుకు ఆదాయం	రూ.6,76,80,727

(మద్యం షాపులు పనిచేసే వేళల్లో మాత్రమే వినియోగాన్ని లెక్కించడం జరిగింది)

పంట నష్టంపై వెంటనే నివేదికలివ్వండి

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఓ అర్జీదారుడి సమస్య వింటున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జరిగిన పంటనష్టంపై వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు వెంటనే నివేదిక రూపొందించి అందజేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 201 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు పంపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూ సర్వే, సదరం క్యాంపుల నిర్వహణ, పింఛన్ల పంపిణీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పనుల పురోగతిపై సమీక్షించారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీ నవంబర్ 1వ తేదీన ఉదయం 6 గంటలకే ప్రారంభం కావాలన్నారు. ఇందుకోసం 30వ తేదీనే బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయప్రసాద్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, పరిశ్రమల శాఖ ఏజీఎం నాగరాజు, డీసీహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, పుట్టపర్తి మున్సిల్ కమిషనర్ ప్రహ్లాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

- నైపుణ్య గణనను పారదర్శకంగా నిర్వహించాలి
- జిల్లా స్థాయి శిక్షణలో కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ఏ కోర్సు చదివినా, అందులో నైపుణ్యం ఉన్న వారికే ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయని, అందువల్ల యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే 'స్కిల్ సెన్సెస్' చేపట్టిందన్నారు. భవిష్యత్తులో రాగల మార్పులకు అనుగుణంగా యువత కూడా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సోమవారం డీఆర్‌డీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'నైపుణ్య గణన–2024' జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఆటోమేషన్, కృత్రిమ మేధ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించనున్నాయన్నారు. అందువల్లే ప్రభుత్వం చేపట్టిన స్కిల్ సెన్సెస్ చేపట్టి, వాటి ఆధారంగా యువతకు శిక్షణ ఇవ్వాలని భావిస్తోందన్నారు. అందువల్లే స్కిల్ సెన్సెస్ పారదర్శకంగా నిర్వహించి వివరాలను నైపుణ్య యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న సిబ్బంది మంగళవారం నుంచి మున్సిపాలిటీలు, గ్రామ స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. నవంబర్ మొదటి వారంలో స్కిల్ సెన్సెస్‌ను ప్రారంభించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ అశోక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరీష్, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుదర్శనరెడ్డి పాల్గొన్నారు.

దళితుడి అంత్యక్రియలకు ఆటంకం

- బసంపల్లిలో దళితుల శ్మశాన వాటిక స్థలం పరాధీనం
- శనివారం అనారోగ్యంతో నరసింహులు మృతి
- ఖననం చేసే స్థలం లేక రెండురోజులుగా ఇంట్లోనే మృతదేహం
- సోమవారం అధికారుల స్పందనతో అంత్యక్రియలు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న దళితవాడ వాసులు



నరసింహులు మృతదేహం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లిలో ఓ దళితుడి అంత్యక్రియలకు ఆటంకం ఏర్పడింది. శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలం పరాధీనం కావడంతో రెండురోజులుగా మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి. చివరకు ఎస్సీ, ఎస్టీ సంఘాలు, అధికారులు స్పందించడంతో సోమవారం అంత్యక్రియలు జరిగాయి. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని బసంపల్లి గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే గ్రామంలో దళితుల శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన శంకర నారాయణ కుటుంబం ఆక్రమించి చుట్టూ కంచె వేసుకుంది. దీంతో పూడ్చేందుకు స్థలం లేక కుటుంబీకులు నరసింహులు మృతదేహాన్ని రెండురోజులుగా ఇంట్లోనే ఉంచుకున్నారు. ఆదివారం రాత్రి పలువురు స్థానికులు విషయాన్ని చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. వారు సోమవారం ఉదయం గ్రామానికి చేరుకొని శ్మశాన వాటిక సమస్య గురించి చర్చించారు. దళితుల శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలంలో మృతదేహాలను ఖననం చేయకుండా శంకర నారాయణ కుటుంబం అడ్డుకుంటోందని పలువురు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య 20 ఏళ్లకుపైగా ఉందని, ఎవరు మృతి చెందినా పూడ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన స్థలంలో మృతదేహాన్ని ఖననం చేయనీయకపోతే కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి అన్నారు. దీంతో తహసీల్దార్ విషయాన్ని ధర్మవరం ఆర్డీఓ మహేష్, డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు గ్రామానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో సమస్య లేకుండా మృతదేహాన్ని శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలంలో ఖననం చేయించారు. దీంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థల వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని, తీర్పు ఎవరికి అనుకూలంగా వచ్చినా అందుకు కట్టుబడి ఉండాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కేసులు నమోదు చేయాలని ఆర్డీఓ ఈ సందర్భంగా డీఎస్పీకి సూచించారు.

పింఛన్ కోత.. ప్రతి నెలా వ్యథ

- నాలుగు నెలల్లోనే నాలుగు వేల మందికి కోత
- ఈ నెలలో ఎంతమందికి కట్ చేస్తారోనని వృద్ధుల్లో ఆందోళన
- రాజకీయ కక్షలతో చాలామంది అర్హులకు మొండిచెయ్యి
- ప్రతి నెలా వెయ్యి మందికిపైగా పింఛన్ జాబితా నుంచి అవుట్
- అర్హత ఉన్నా.. అనర్హత పేరుతో నోటీసులు.. వెంటనే తొలగింపు
- కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చి.. నిరసన వ్యక్తం చేసినా ఫలితం శూన్యం



పింఛన్ అందలేదని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రామగిరి మండల లబ్ధిదారులు (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'అమ్మో ఒకటో తారీఖు' అనే రీతిలో పింఛన్‌దారులు బెంబేలెత్తిపోతున్నారు. జాబితాలో ఎవరి పేరు ఉంటుందో? ఎవరికి పింఛన్ ఇస్తారో? ఎంతమందికి ఎగ్గొడతారో? తెలియక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. టీడీపీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని గ్రామ స్థాయిలో రాజకీయాలు చేస్తూ పేద, మధ్య తరగతి వారిపై పెత్తనం చేస్తున్నారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు రాజకీయ రంగు పూసి వారికిచ్చే పింఛన్లకు అధికారులతో కోత పెట్టిస్తున్నారు. ఫలితంగా చాలామంది పేదలు అర్హత ఉండీ పింఛన్ అందుకోలేక పోతున్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమనే కారణంతో.. పింఛన్లు ఇవ్వకుండా ప్రతి నెలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోతున్నారు.

కండువా వేసుకుంటే పింఛన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాప్తాడు నియోజకవర్గంలోనే ఎక్కువగా పింఛన్లను తొలగించారు. ఏ ఒక్కరిని పలకరించినా.. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమనే కారణంతో పింఛన్ తొలగించారని చెబుతున్నారు. గ్రామ స్థాయిలో కొందరు టీడీపీ నేతలు రాజకీయ కక్షతో పింఛన్‌లు కోతకు సిద్ధపడి అధికారులపై ఒత్తిళ్లు తెచ్చినట్లు తేలింది. దీంతో కనగానపల్లి, రామగిరి మండలాల్లో వందల మంది పింఛన్లు కోల్పోయారు. టీడీపీ కండువా వేసుకుంటేనే పింఛన్... లేదంటే లేదు అంటూ కొందరు టీడీపీ నేతలు గ్రామాల్లో అల్టిమేటం జారీ చేస్తున్నారు. అయితే ఆత్మాభిమానం చంపుకోలేక...పార్టీ మారలేక చాలా మంది అర్హులు పింఛన్లు కోల్పోతున్నారు. నవంబర్‌లో ఇంకెంత మందిని జాబితా నుంచి తొలగిస్తారోనని చాలామంది భయపడుతున్నారు.

జాబితాలో పేరున్నా..

పింఛన్ల జాబితాలో పేరు ఉంటుంది... లబ్ధిదారుడికి సంబంధించిన సొమ్ము కూడా విడుదల అవుతాయి... కానీ అర్హులకు ఆ సొమ్ము అందకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. ప్రతి నెలా ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఇలాంటి ఘటనలు భారీగా వెలుగు చూస్తున్నాయి. టీడీపీ నేతల ఒత్తిడికి తలొగ్గుతున్న అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే అర్హుల పింఛన్లు తొలగిస్తున్నారు. ఇంకొందరికి అర్హత లేదని.. ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని చెబుతున్నారు.



నాలుగు నెలల్లో నాలుగు వేల మందికి పైగా..

కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు జూన్ 1వ తేదీన జిల్లాలో 2,70,973 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండే వారు. క్రమక్రమంగా ప్రతి నెలా పింఛన్‌దారుల సంఖ్య తగ్గించారు. ఈ క్రమంలో జూలైలో 1,766 మంది, ఆగస్టులో 1,128 మందికి, సెప్టెంబర్ 841 మందికి పింఛన్‌లో కోత పెట్టారు. ఇలా నాలుగు నెలల్లో 3,735 మందిని పింఛన్ అర్హుల జాబితా నుంచి తొలగించారు. అక్టోబరు ఒకటో తేదీ నాటికి 2,67,238 మంది మాత్రమే పింఛన్ లబ్ధిదారులున్నారు. నవంబర్ ఒకటో తేదీన వీరికి పింఛన్ ఇవ్వాల్సి ఉంది. అయితే అర్హుల జాబితాలో ఎంతమంది ఉంటారో...ఎంత మందికి కోత పెడతారో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో పింఛన్ లబ్ధిదారుల సంఖ్య ఇలా...

నెల	లబ్ధిదారుల సంఖ్య
జూన్	2,70,973
జూలై	2,69,209
ఆగస్టు	2,68,079
సెప్టెంబర్	2,67,238

నోటీసులు ఇచ్చాకే తొలగింపు

నాలుగు నెలల వ్యవధిలో 3,735 మందిని పింఛన్ల జాబితా నుంచి తొలగించిన మాట వాస్తవమే. అయితే అందులో డోర్ లాక్, మైగ్రేషన్, హాస్పిటలైజ్డ్, డెత్ అయిన వారు ఉన్నారు. ఏ కారణం లేకుండా ఎవరినీ తొలగించలేదు. క్షేత్రస్థాయిలో కొందరిని అనర్హులుగా గుర్తించి నోటీసులు ఇచ్చాక తొలగించారు. ఏదైనా ఉంటే కోర్టును ఆశ్రయించి న్యాయం పొందవచ్చు.

– కేఎస్ నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

డీఆర్‌ఓ విజయ సారథి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ టీఎస్ చేతన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్‌ఓ విజయసారథి

ప్రశాంతి నిలయం: నూతన డీఆర్‌ఓ విజయ సారథి సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన కలెక్టర్ టీఎస్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఏపీఐఐసీలో ఓఎస్డీగా పనిచేస్తున్న ఆయన్ను.. ప్రభుత్వం ఇటీవలే జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ)గా బదిలీ చేసింది. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఆర్‌ఓగా పనిచేసిన కొండయ్యను విజయవాడ జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ప్రమోదం వెంటే ప్రమాదం

- బాణసంచా పేల్చడంలో జాగ్రత్తలు పాటించాలి
- పెద్దలు వెంటుంటే ఆనందం మీ వెంటే
- తుంటరి తనంతో జీవితం చీకటిమయం



కదిరి: ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే దివ్య దీప్తుల దీపావళి రానేవచ్చింది. చీకటిని పార ద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళిని ఏటా ఆశ్వయుజ అమావాస్య రోజున జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే దీపావళిని వేడుకగా జరుపుకునే క్రమంలో చాలా ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు గాయపడుతున్నారు. టపాసులు పేల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. చాలా ఎక్కువ తీక్షణమైన వెలుగు, దానితో పాటు వెలువడే వేడి, మంట.. ఈ మూడు అంశాలతో కళ్లకు తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. బాణసంచాలోని రసాయనాలతో కళ్లు దెబ్బతింటాయి. సల్ఫర్, గన్‌పౌడర్ లాంటి రసాయనాల ప్రభావం వల్ల కళ్ల నుంచి నీరు కారడం, కళ్ల మంటలు, దురద వంటి ప్రభావాలు ఉంటాయి. ఒక్కోసారి కళ్లు పూర్తిగా కనబడకుండా పోతాయి.

ప్రమాద నివారణ, జాగ్రత్తలు ఇలా

- టపాసులు వెలిగించిన వెంటనే దూరంగా జరగాలి. పేలని టపాసులపై ఒంగి చూడడం మంచిది కాదు.
- కంటికి రక్షణగా ప్లెయిన్ అద్దాలు వాడటం మంచిది.
- పేరున్న సంస్థలు తయారు చేసిన టపాసులనే ఎంపిక చేసుకోవాలి. అన్ని అనుమతులు ఉన్న చోటే టపాసులు కొనుగోలు చేయాలి.
- పిల్లలు, యువకులు, మహిళలు ఇలా ఎవరు ఏ రకం టపాసులు కాల్చాలో ముందే నిర్ణయించుకుని కొనాలి. ఆ ప్రణాళిక మేరకే కాల్చాలి.
- ప్రమాదవశాత్తు కంటికి ఏదైనా గాయమైతే వెంటనే కంటి డాక్టర్‌ను సంప్రదించాలి.
- బాణసంచాను కిచెన్, పొయ్యి ఉన్న ప్రాంతాల్లో ఉంచకూడదు.
- బాణసంచా కాల్చేటప్పుడు వదులుగా ఉన్న దుస్తులు ధరిస్తే అవి వేలాడుతూ అంటుకునే ప్రమాదం ఉంది. కొద్దిగా బిగుతైన కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి.
- టపాసులను మరీ వంగి కాల్చకూడదు. పేలితే ఒళ్లు కాలే ప్రమాదం ఉంది.
- బాణసంచా కాల్చేసమయంలో రెండు బకెట్లలో నీళ్లు సిద్ధంగా ఉంచుకోవాలి.
- చర్మం కాలితే కంగారు పడకుండా గాయంపై మంట తగ్గే వరకూ నీటిని పోయాలి.
- కాలిన గాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రుద్ద కూడదు.
- చేతి వేళ్లు తీవ్రంగా కాలితే వేళ్లు అతుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే వాటి మధ్య తడిగుడ్డ ఉంచాలి.
- ప్రమాదం జరిగితే వీలైనంత త్వరగా సమీపంలోని డాక్టర్‌ను సంప్రదించాలి.
- మరింత శబ్దం కోసం కుండలు, రేకు డబ్బాలు, గాజు వస్తువుల్లో బాణాసంచా ఉంచి కాల్చకూడదు. అవి పేలినప్పుడు వేగంగా విస్తరించే పెంకుల వల్ల చర్మం, కళ్లు, ఇతర అవయవాలు తీవ్రంగా గాయపడే ప్రమాదం ఉంది.
- చిన్న పిల్లలను ఎత్తుకుని బాణసంచా కాల్చకూడదు. పెద్ద వాళ్ల సహాయం లేకుండా పిల్లలు వాళ్లంతట వాళ్లే కాల్చడం సరికాదు. పిల్లలు కాల్చేటప్పుడు పెద్దలు పక్కనే ఉండి వారిని జాగ్రత్తగా గమనించాలి.
- అప్పుడే పుట్టిన చిన్నారులు, పిల్లలు, గర్భిణులు, వృద్ధులపై బాణసంచా శబ్దాలు ఎక్కువ ప్రభావం చూపుతాయి. ప్రధానంగా చెవులు దెబ్బతింటాయి. కొన్ని టపాసుల శబ్దం 100–120 డెసిబెల్స్ వరకూ ఉంటుంది. సాధారణంగా మన చెవి 7 డెసిబెల్స్ శబ్దాన్ని హాయిగా వినగలుగుతుంది. ఆపై పెరిగే శబ్దం చెవిని ఇబ్బంది పెడుతుంది. కాబట్టి చెవులను రక్షించుకోవడానికి ఇయర్ ప్లగ్స్ కొంత మేరకు ఉపయోగపడతాయి. పెద్ద శబ్దాలతో పేలే టపాసులు కాకుండా చాలా తక్కువ శబ్దంతో పూల లాంటి వెలుగులు కురిపించే చిచ్చుబుడ్లు, కాకర వత్తులు, పెన్సిళ్లు, భూచక్రాలు వంటివి కాల్చడం మంచిది.
- భూచక్రాలు, ఔట్లు కూడా ఒక్కోసారి పేలే ప్రమాదం ఉంది. వీటిని అగ్గిపుల్లలతో కాకుండా కాకర వత్తులతో కాల్చడం మంచిది.

అనుమతులు తప్పని సరి

ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా పేలుడు పదార్థాల చట్టం కింద చర్యలు తప్పవు. జనావాసాల మధ్య బాణసంచా విక్రయించడం, స్టాక్ పెట్టడం కూడా నేరం. విక్రయ కేంద్రాల వద్ద ఇసుక, అగ్నిమాపక సామగ్రి సిద్ధంగా ఉంచాలి. బాణసంచా పేల్చేటప్పుడు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని పండుగను ఆనందమయం చేయాలి. **– వి.రత్న, ఎస్పీ**

నిర్దేశించిన ప్రదేశాల్లోనే అమ్మకాలు

జిల్లా వ్యాప్తంగా టపాసుల విక్రయాలకు అనుమతులు తీసుకున్న వారు నిర్దేశించిన ప్రాంతాల్లోనే వాటిని అమ్మాలి. అక్కడ అన్ని జాగ్రత్తలు పాటిస్తూ విక్రయాలు జరపాలి. లేదంటే లైసెన్స్ రద్దుతో పాటు తగిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే స్థానిక ఫైర్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. **– మహేంద్రరెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి**

సొంత వైద్యం వద్దు

టపాసులు కాల్చేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే కొందరు సొంత వైద్యం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. అంతకు మునుపు ప్రథమ చికిత్స చేసేటప్పుడు కాలిన గాయంపై చల్లని నీరు పోయాలి. అంతేగానీ ఐస్‌ముక్కలతో రుద్ద కూడదు. వెన్న, గ్రీజ్, ఇతర పౌడర్ వంటివి కూడా రాయకూడదు. వీటి వలన ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. **– మంజువాణి, జిల్లా వైద్యాధికారి**

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 45 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 45 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

బావిలో పడి బాలుడి మృతి



ప్రసాద్‌నాయక్ (ఫైల్)

కదిరి అర్బన్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ బాలుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం సున్నపుగుట్ట తండాకు చెందిన బాలాజీ నాయక్, లక్ష్మీదేవి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. మేకల పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం మేకలకు ఆకుల కోసుకువచ్చేందుకు గ్రామ సమీపంలోని బావి వద్దకు పెద్ద కుమారుడు ప్రసాద్ నాయక్ (17) వెళ్లాడు. రాత్రి ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు గాలింపు చేపట్టారు. ఆ సమయంలో ప్రసాద్‌నాయక్ బావి వద్దకు వెళుతుండగా తాను చూసినట్లు ఓ మహిళ తెలపడంతో అందరూ కలసి బావి వద్దకెళ్లారు. చీకటి పడడంతో బావిలో దిగేందుకు వీలుపడక సోమవారం ఉదయం గాలింపు చేపట్టారు. బావిలో తేలియాడుతున్న ప్రసాద్‌నాయక్ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది అక్కడకు చేరుకుని పాతాళభైరవి పనిముట్టుతో ప్రసాద్‌నాయక్ మృతదేహాన్ని వెలికి తీశారు. మేకల కోసం ఆకులు కోస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో జారి పడి నీట మునిగి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మోహన్ తెలిపారు.

నవోదయలో నేడు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ వేదికగా అండర్ –14 బాల, బాలికల రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు క్రీడల ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేష్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మొరార్జీ యాదవ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

'సేఫ్ డ్రైవ్ - సేవ్ లైఫ్'పై సైకిల్ యాత్ర



లేపాక్షికి చేరుకున్న బిప్‌లాబ్‌సింగ్

లేపాక్షి: 'సేఫ్ డ్రైవ్ – సేవ్ లైఫ్'పై ప్రజలను చైతన్య పరుస్తూ పశ్చిమ బెంగాల్‌లోని బాంకురా జిల్లా జాల్‌మేజ గ్రామానికి చెందిన బిప్‌లాబ్‌సింగ్ చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం మధ్యాహ్నం లేపాక్షికి చేరుకుంది. ఈ సందర్భంగా వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులను ఆయన చైతన్య పరిచారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, అటవీ ప్రాంతాలు, మట్టి సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ 6న పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభమైన తన సైకిల్ యాత్ర భూటాన్, నేపాల్, అరుణాచల ప్రదేశ్, సిక్కిం, తదితర ప్రాంతాల నుంచి 22,200 కిలో మీటర్లు దూరం కొనసాగిందన్నారు. ఇక్కడి నుంచి బెంగళూరు, కన్యాకుమారి వరకు కొనసాగుతుందన్నారు. రోజుకు 120 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఏల రేషనలైజేషన్ నిలిపివేయాలి



నిరసన తెలుపుతున్న సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయ శాఖలో చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియను నిలిపి వేసి ఉద్యాన సహాయకులను (హెచ్‌ఏ) మాతృశాఖలో విలీనం చేయాలని కోరుతూ జిల్లా ఉద్యానశాఖ కార్యాలయం ఎదుట హెచ్‌ఏలు సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రేషనలైజేషన్ ప్రక్రియతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యాన హబ్ అనేది కలగానే మిగిలిపోతుందన్నారు. జిల్లాలో ఉద్యానశాఖ విస్తీర్ణం తగ్గించి చూపి, ఉద్యోగులకు స్థాన చలనం కలిగించాలనుకోవడం పాలకుల అవివేకానికి నిదర్శనమన్నారు. జిల్లాను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దాలంటే ఉద్యాన సహాయకుల సేవలు ముఖ్యమని అన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియను ఆపకపోతే దశల వారీగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా ఉద్యానాధికారి చంద్రశేఖర్‌కు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

నల్లచెరువు: మండలంలోని అల్లుగుండు వద్ద జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో పంతులచెరువు వీఆర్వో సుశీల గాయపడ్డారు. విధి నిర్వహణ కోసమని సోమవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై కదిరి నుంచి బయలుదేరిన ఆమె... అల్లుగుండు వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో బైక్ రైడర్ ఢీకొన్నాడు. ఘటనలో కాలు విరిగి బాధపడుతున్న సుశీలను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ బిల్లు చెల్లించలేదని మీటరు ధ్వంసం



లైన్‌మెన్ చేతిలో ధ్వంసమైన విద్యుత్ మీటరు

కంబదూరు: విద్యుత్ బిల్లు చెల్లించడంలో ఆలస్యం చోటు చేసుకోవడంతో ఆగ్రహించిన లైన్‌మెన్ ఏకంగా విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేశాడు. వివరాలు... కంబదూరులోని చెక్‌పోస్టు ప్రాంతంలో వృద్ధ దంపతులు నారప్ప, రాధమ్మ నివాసముంటున్నారు. వీరి ఇంటికి సంబంధించిన విద్యుత్ బిల్లులను కుమారులు క్రమం తప్పకుండా ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తూ వచ్చారు. అయితే సాంకేతిక కారణాలతో ఈ నెల రూ.450 బిల్లు చెల్లించక లేకపోయారు. దీంతో లైన్‌మెన్ బసవరాజు సోమవారం నారప్ప ఇంటి వద్దకెళ్లి బిల్లు చెల్లించాలని నిలదీశాడు. తమకు అరగంట సమయం ఇస్తే నగదు రూపంలో రూ.450 చెల్లించి వస్తామని వృద్ధదంపతులు మొరపెట్టుకున్నా బసవరాజు వినలేదు. నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేసి, బిల్లు చెల్లించి రసీదు చూపకపోతే కనెక్షన్ కట్ చేస్తానంటూ హెచ్చరిస్తూ వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు లైన్‌మెన్ దౌర్జన్యంపై మండిపడ్డారు. వయసులో పెద్దవారని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు దుర్భాషలాడడం సరికాదన్నారు. గతంలోనూ విద్యుత్ బిల్లు చెల్లించలేదంటూ ఓ వినియోగదారుడిపై చెయ్యి కూడా చేసుకున్నాడని మండిపడ్డారు. వినియోగదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.


ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా చైర్మన్‌గా రామకృష్ణారెడ్డి



డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, బి.దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న ఆచార్య కె.హేమచంద్రారెడ్డి

అనంతపురం: 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా' అనంతపురం చాప్టర్ నూతన చైర్మన్‌గా డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, సెక్రెటరీగా డాక్టర్ బి.దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. రెండేళ్ల పాటు వీరు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఎంబీఏ విభాగంలోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా – అనంతపురం ఛాప్టర్‌లో సోమవారం 10వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఐఈఈ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవ కుమార్ హాజరై, ప్రసంగించారు. గతేడాది జరిగిన కార్యక్రమాలను బోర్డు ఆఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ వి.శంకర్ వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.మమత, డాక్టర్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ యజమాని ఆత్మహత్య



మృతుడు నరసింహుడు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో నివాసముంటున్న నర్సరీ యజమాని నరసింహుడు(35) ఆత్మహత్య చేసుకున్నాడు. వైఎస్సార్ జిల్లా వేంపల్లి గ్రామానికి చెందిన ఆయన పదేళ్ల క్రితం ముదిగుబ్బకు వలస వచ్చి నర్సరీ ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆశించిన వ్యాపారం సాగకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య సుధ, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం

ఉరవకొండ: బొలెరో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పల నివాసి నాగార్జున (38), బీకేఎస్ మండలం రేగడికొత్తూరుకు చెందిన మంగలి ఈశ్వరయ్య, ఉపేంద్ర ముగ్గురు కలసి ఓ ద్విచక్ర వాహనంపై సోమవారం ఉదయం బొమ్మనహాల్ మండలం ఉంతకల్లులోని పాండురంగస్వామి ఆలయంలో మాల ధరించడానికి బయలుదేరారు. ఉరవకొండ సమీపంలోని పాల్తూరు క్రాస్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. నాగార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వరయ్య, ఉపేంద్రను స్థానికులు 108 అంబులెన్స్‌లో ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లుసీఐ సురేష్‌బాబు తెలిపారు.

నేటి నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్

పుట్టపర్తి అర్బన్: కూటమి ప్రభుత్వం ఏడాదికి ఇచ్చే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. తెల్లరేషన్ కార్డు, ఏఏవై కార్డులు, అన్నపూర్ణ కార్డులున్న వారికి మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 5,36,289 కనెక్షన్లకు ఉచిత గ్యాస్ అందుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీక్రిష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చునని, 31వ తేదీ నుంచి పథకం అమలవుతుందన్నారు. ఒక లబ్ధిదారుడు సంవత్సరంలో 3 సిలిండర్లు మాత్రమే ఉచితంగా పొందే అవకాశం ఉందన్నారు. లబ్ధిదారు గ్యాస్ బుక్ చేసుకుంటే.. సిలిండర్ డెలివరీ అయిన తర్వాత వారి ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని పేర్కొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించండి : ఎస్పీ

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ రత్న సూచించారు. ఫ్యాక్షన్, పొలిటికల్, పెండింగ్ కేసులపై సోమవారం డీపీఓలో విలేజ్ పోలీస్ అధికారుల (వీపీఓ)తో ఆమె సమీక్షించారు. కేటాయించిన గ్రామాల్లో వారంలో రెండు సార్లు పర్యటించి అక్కడి పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. గొడవలు జరిగే పరిస్థితులుంటే ముందస్తు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. ఇప్పటికే కేసుల్లో ఉన్న నిందితుల ప్రవర్తన, వారి జీవనవిధానాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, వీపీఓలు పాల్గొన్నారు.

విషపూరిత ద్రావకం తాగి వృద్ధుడి మృతి



మృతుడు రంగధామప్ప

గుడిబండ: మంచి నీళ్లనుకుని విషపూరిత ద్రావకం తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం బీటీపల్లికి చెందిన రంగధామప్ప (68)కు భార్య శాంతమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తన పొలంలో మల్బరీ షెడ్డును శుభ్రం చేసేందుకు వెళ్లిన ఆయన మధ్యాహ్న సమయంలో దప్పిక కావడంతో అక్కడే ఉన్న బాటిల్‌లోని ద్రావకాన్ని (ఫార్మాలిన్) నీళ్లుగా భావించి తాగాడు. కాసేపటి తర్వాత కడుపులో మంట, కళ్లు తిరుగుతుండడంతో అక్కడున్న వారికి తెలపడంతో వారు వెంటనే గుడిబండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రంగధామప్ప మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు.

ఆచూకీ లేని అటెండర్



రామాంజినమ్మ

అనంతపురం: నగరంలోని వెటర్నరీ శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న రామాంజినమ్మ కనిపించడం లేదు. ఈ నెల 17వ తేదీ వరకూ క్రమం తప్పకుండా విధులకు హాజరైన ఆమె 18వ తేదీ నుంచి విధులకు గైర్హాజరయ్యారు. స్వస్థలం గుత్తి కాగా, కారుణ్య నియామకం కింద భర్త ఉద్యోగం ఆమెకు దక్కింది. కుమారుడు హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. పది రోజులుగా ఆమె సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ కావడంతో కూతురు అశ్విని తన మామను వెంటబెట్టుకుని సోమవారం అనంతపురంలోని లలితానగర్‌లో రామాంజినమ్మ నివాసం ఉంటున్న ఇంటిని పరిశీలించారు. బీరువా ధ్వంసం చేసి ఉంది. అందులోని దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఇంట్లోని సీసీ కెమెరా ఫుటేజీలను తొలగించి, హార్డ్‌డిస్క్ సైతం మాయం చేసినట్లుగా గుర్తించిన అశ్విని తీవ్ర భయాందోళనకు గురై, వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా విధులకు హాజరయ్యే రామాంజినమ్మ అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

పుట్టపర్తి: ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జగదీశ్వర్, పీడీ నాగరాజు సోమవారం తెలిపారు. 89 కేజీల విభాగంలో గణేష్‌రెడ్డి, 81 కేజీల విభాగంలో ముక్తియార్, అండర్–19 విభాగం 68 కేజీల విభాగంలో మంజూనాథ్, 50 కేజీల విభాగంలో మోహనకృష్ణ ఎంపికయ్యారు. వీరిని ఉన్నతపాఠశాల సిబ్బంది సోమవారం అభినందించారు. వీరు నవంబర్ రెండో తేదీన తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

కుంటిమద్ది విద్యార్థిని ఎంపిక



అలేఖ్య

రామగిరి: కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అలేఖ్య రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ నగేష్ తెలిపారు.